www.prajasakti.com
ప్రజాశక్తి



స్వచ్ఛందంగా రక్తదానం చేయండి

ఏలూరు అర్బన్:ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 14 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సుమారు 200 మంది తలసేమియా వ్యాధి పిల్లలు, 120 మంది సికిల్ సెల్ అనీమియా వ్యాధి పిల్లలు రెడ్‌క్రాస్ భవనంలో నమోదయ్యారన్నారు. వీరందరికీ రక్తమార్పిడికి ఏడాదికి 1200 నుంచి 1300 బ్లడ్ యూనిట్లను రెడ్‌క్రాస్ ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన చాగర్లమూడి రాజ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి కెవి.సీతారాం, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు, ఏలూరు మానవత ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు పాల్గొన్నారు.

'నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటు మాకొద్దు.. మమ్మల్ని ఇలా బతకనివ్వండి. గిరిజనులను ఏజెన్సీ నుంచి తరిమేయాలని కేంద్రంలో మోడీ సర్కార్, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నాయా.. మాకు చెప్పకుండా మా భూముల్లో సర్వేలు ఏ విధంగా చేస్తారు.. మా భూములన్నీ లాగేసుకుని మమ్మల్ని రోడ్డున పడేయాలని, ఇక్కడి నుంచి గెంటేయాలని చూస్తారా.. డిపో ఏర్పాటును అడ్డుకునేందుకు దేనికైనా సిద్ధం' అంటూ జీలుగుమిల్లి మండలం వంకావారి గూడెం పంచాయతీ పరిధిలోని గ్రామస్తులంతా ఖరాఖండిగా చెప్పేశారు. అందుకు వ్యతిరేకంగా గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.. యుద్ధసామగ్రి డిపోపై ముందుకు సాగితే ప్రజా'యుద్ధం' తప్పదంటూ అధికారులను హెచ్చరించారు.


గ్రామసభలో డిపోకు వ్యతిరేకంగా చేతులు ఎత్తిన గిరిజనులు (ఫైల్‌ఫోటో)


నేవీ డిపో ఆపకుంటే 'యుద్ధ'మే..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో 1,166 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని చూస్తున్న నేవీ యుద్ధ సామగ్రి డిపోపై స్థానిక ప్రజానీకం తిరుగుబాటుకు దిగారు. తమను సంప్రదించకుండా తమ భూముల్లో సర్వేలు నిర్వహించి, భూసేకరణ చేసేందుకు ముందుకు సాగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో యుద్ధసామగ్రి డిపోను వ్యతిరేకిస్తూ గ్రామస్తులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తమ మనోభావాలకు వ్యతిరేకంగా యుద్ధసామగ్రి డిపో ఏర్పాటుపై ముందుకు సాగితే ప్రజాయుద్ధం తప్పదని అధికారులను హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండలంలో నేవీ యుద్ధసామగ్రి డిపోను ఏర్పాటు చేయాలని కేంద్రంలోని మోడీ సర్కార్ పూనుకుంది. విషయం బయటికి రాకుండా ముందుగానే అధికారులతో సర్వేలు సైతం చేయించింది. కేంద్రం నిర్ణయానికి రాష్ట్రం వంత పాడటంతో అధికారులు అక్కడి ప్రజలకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా ముందుకు సాగుతున్నారు. యుద్ధసామగ్రి డిపో ఏర్పాటు విషయం బయటికి రావడంతో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకావారిగూడెం, దాట్లవారిగూడెం, కొత్తపేటలివారిగూడెం, రమణక్కపేట ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. డిపోను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. యుద్ధసామగ్రి డిపో ఏర్పాటు వద్దంటూ వద్దంటూ తేల్చి చెప్పేశారు.

నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటైతే తీవ్ర నష్టమే

నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటైతే జీలుగుమిల్లి మండలంలో తీవ్ర నష్టం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గిరిజనులకు చెందిన వేలాది ఎకరాల భూమి నేవీ చేతిలోకి వెళ్లిపోతుంది. గ్రామాలకు గ్రామాలే ఖాళీ చేయాల్సి ఉంటుంది. డిపో ఏర్పాటైన తర్వాత చుట్టుపక్కల కిలోమీటర్ల మేర ఆంక్షలు, నిర్బంధాలు కొనసాగుతాయి. సొంత గ్రామాలకు వెళ్లాలన్నా తనిఖీలు చేసే


నేవీ యుద్ధ సామగ్రి డిపోకు వ్యతిరేకంగా చేసిన తీర్మానం (ఫైల్‌ఫోటో)

పరిస్థితి ఉంటుంది. ఇంకా అనేక ఫ్యాక్టరీలు ఏర్పాటుకు అడుగులు వేసి భూములను లాగేసుకునే పరిస్థితి ఏర్పడనుంది. ఉద్యోగాలు వస్తాయని చెబుతున్న మాటలన్నీ బూటకమే అంటున్నారు. నేవీ యుద్ధసామగ్రి డిపోలో నిపుణులైన ఉద్యోగులు మాత్రమే పని చేస్తారు. అంటే స్థానిక ప్రజానీకానికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండదు. అటెండర్, శుభ్రత పనులకోసం కొంతమందిని తీసుకున్నా అవి తాత్కాలికమేనని చెప్పొచ్చు. జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలు ఏజెన్సీ ప్రాంతాలుగా ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు పేరుతో పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మూడు మండలాల్లోని గిరిజనులను ఖాళీ

గ్రామసభలో నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత

అధికారులపై వంకావారిగూడెం, పరిసర గ్రామాల ప్రజలు మండిపాటు

ఏజెన్సీలో గిరిజనులను బతకనీయరా అంటూ ఆవేదన

ఇప్పటికే 'పోలవరం' పేరుతో వేల గిరిజన కుటుంబాలది తలోదారి

డిపోను అడ్డుకునేందుకు దేనికైనా సిద్ధమంటూ జనం హెచ్చరిక

చేయించి తలోదారి అన్నట్లు గ్రామాల నుంచి తరిమేశారు. పుట్టిన ఊరును వదిలేసి వారంతా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు జీలుగుమిల్లి మండలంలో నేవీ యుద్ధ సామగ్రి ఏర్పాటు చేసి ఇక్కడ గిరిజనులను కూడా తరిమివేయాలని చూస్తున్నారు. గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో అందరిలోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదే డిపోను మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ అటువైపు చూడకుండా తక్కువ ధరకు గిరిజనుల భూములను కాజేసేందుకు ప్రణాళిక రచించారు. నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటైతే జీలుగుమిల్లి మండలం మొత్తం నేవీ కనుసన్నల్లోకి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడనుంది. యుద్ధ సామగ్రి డిపోను వ్యతిరేకంగా తాము దేనికైనా సిద్ధమని గిరిజనులతోపాటు, ఆ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.


అర్ధనగ్నంగా ధర్నా చేస్తున్న నిర్మాణ కార్మికులు

నిర్మాణరంగ కార్మికుల అర్ధనగ్న ధర్నా


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక సరఫరాను పునరుద్ధరించి లక్షలాది మంది నిర్మాణరంగ కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ భవన నిర్మాణరంగ కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం అర్ధనగ్నంగా కార్మికులు ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ కార్మికుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఉపాధిని కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. రూ.1900 కోట్ల వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికులకు ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఇచ్చిన 1214 మెమో ఎత్తివేయాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ మెటీరియల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. స్టీలు, ఐరన్, ఇసుక తదితర మెటీరియల్ ధరలు ఎన్నో రెట్లు పెరిగాయని వాపోయారు. అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో జిల్లా నాయకులు చినిమిల్లి రాంబాబు, ఎసి రెడ్డి,వి.మాధవ, కెల్లా దుర్గాప్రసాద్, రెడ్డి లక్ష్మణరావు, సిఐటియు నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథం పాల్గొన్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

అప్పుల బాధ భరించలేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన విషాదఘటన మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పరసా నాగబాబు(30)కు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన అనూష(25)కు 2015లో వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. నాగబాబు కొంతకాలంగా కౌలుకు మూడు ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. సాగులో నష్టాలు రావడంతో సుమారు రూ.పది లక్షల వరకూ అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక నాగబాబు దంపతులు ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న


ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనూష తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు. మృతదేహాలకు గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రాష్ట్రానికి ఏం చేసిందని బిజెపి ప్రచారం?

'వికసిత్ భారత్'కు ఐఎఎస్‌లను వినియోగించడం సిగ్గుచేటు : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో ఐఎఎస్ అధికారులను వినియోగించడం సిగ్గుచేటని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఐఎఎస్ అధికారులు అన్నిశాఖల గ్రూప్ 1,2 అధికారులను వినియోగించడం గర్హనీయమన్నారు. కేంద్రప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఏం చేసిందని, సిగ్గులేకుండా ప్రచారం చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. పైగా తామేదో ఘనకార్యం చేసినట్లు ప్రజల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు ఐఎఎస్ అన్నిశాఖల ప్రభుత్వాధికారులను వినియోగించుకోవడం అభ్యంతరకరమన్నారు. చేతనైతే తన పార్టీ కార్యకర్తలతో ప్రచారం చేసుకోవాలన్నారు. రాజకీయాలకతీతంగా, నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలందించాల్సిన అధికారులను ఇలా వినియోగించడం తగదన్నారు. తక్షణం తమ కుయుక్తులను ఆపాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనుల సమస్యలపై రాజ్యాంగప్రకారం పర్యవేక్షించాల్సిన గవర్నర్ ఏనాడూ ఆ పనులు చేయ లేదుకానీ కేంద్రప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఒక రాజకీయ నాయకునిలా రంగంలోకి దిగడం హాస్యాస్పదమన్నారు. తక్షణం ఈ తప్పుడు వైఖరిని సరిచేసుకోవాలని, తమ రాజకీయ ప్రయోజనాలకు ఐఎఎస్ జిల్లా అధికారులను వినియోగించుకోవడం ఆపాలని డిమాండ్ చేశారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇవిఎం వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం) వినియోగంపై ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తిమ్మయ్యపాలెం, గొల్లగూడెం, యర్రమిల్లిపాడు తదితర గ్రామ సచివాలయ కేంద్రాల్లో ఓటర్లకు మాక్ ఓటింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో గ్రామ గ్రామాన ఓటింగ్ వేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతిఒక్కరూ ఇవిఎంలపై అవగాహన పెంచుకోవాలని పోతురాజు సూచించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు పుచ్చకాయల విష్ణుమూర్తి, తమ్మిన శ్రీనివాసరావు, కరప శ్రీనివాసరావు, బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

నూతన ప్లాంటేషన్ల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ అధ్వర్యంలో నూతన ప్లాంటేషన్ల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ సబ్‌డిఎఫ్‌ఒ ఎ.వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం మండలంలోని కామయ్యపాలెం ప్లాంటేషన్ పరిధిలో ఆయన పర్యటించారు. అనంతరం నూతన ప్లాంటేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ప్రాంతాలను ఖాళీగా ఉంచకుండా ప్లాంటేషన్‌లు వేసి అటవీ శాఖను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. దానికి సంబంధించి మేలు రకానికి చెందిన మారుజాతి మొక్కలను సరైన సమయంలో నాటేందుకు ప్రణాళికలు తయారు చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.శ్రీనివాసరావు, సెక్షన్ అధికారి దినేష్, బీట్ అధికారి మారేష్, సిబ్బంది రాఘవులు, పాపారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

భీమడోలులో కళ్లు మూసుకుని వినూత్న నిరసన

పలుచోట్ల మానవహారాలు, నిరసన ప్రదర్శనలు


సమ్మెకు పెరుగుతున్న మద్దతు, సంఘీభావం

అంగన్‌వాడీల సమ్మె రెండో రోజు బుధవారం ఉధృతంగా సాగింది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు, హెల్పర్లు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల కళ్లు మూసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అలాగే నిరసన ప్రదర్శనలు, మానవహారాలు చేపట్టారు. పలుచోట్ల అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి కొత్తతాళాలు వేయడంపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమ్మెకు టిడిపి, జనసేన పార్టీలతో పాటు వివిధ కార్మిక, ప్రజాసంఘాల నేతలు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించడం చేతగాని ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ విమర్శించారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి రెండో రోజుకు చేరింది. ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి ప్రసాద్ మాట్లాడుతూ ఏడాది కాలంగా పలుమార్లు ప్రభుత్వానికి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరినా జగన్ ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే సమ్మె చేపట్టారన్నారు. యూనియన్‌తో చర్చించి సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లాలో అనేకచోట్ల అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులకొట్టి అన్యాయంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు సిఎం జగన్ అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తామని హామీ ఇచ్చారని, నాలుగున్నరేళ్లు గడిచినప్పటికీ ఆ హామీ అమలు చేయలేదని విమర్శించారు. పైగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌ల పేరుతో పనిభారం పెంచారన్నారు. సెంటర్ అద్దెలు, గాస్ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. నెలల తరబడి బకాయిలుంటే కేంద్రాలను ఎలా నడుపుతారని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి తోడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటి వరకూ ఒక్క రూపాయి జీతం పెంచలేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజని, కార్యదర్శి దుర్గాభవాని, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు. ఈ సమ్మెకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారపల్లి రమణ, యుటిఎఫ్ నాయకులు పివి.నరసింహారావు, టిడిపి నాయకులు బడేటి చంటి, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

ద్వారకాతిరుమల : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జి అన్నారు. ద్వారకాతిరుమలలో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాల్సిందిపోయి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం వంటి చర్యలకు పూనుకోవడం నిరంకుశత్వమన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ తాళాలు పగులకొట్టాలని కలెక్టర్ సైతం ఆదేశించడం చట్టవిరుద్ధమన్నారు. చట్టాలను కాపాడాల్సిన అధికారులే చట్టవిరుద్ధ కార్యకలాపాలను



ద్వారకాతిరుమలలో..

ప్రోత్సహించడం దారుణమన్నారు. సమ్మెకు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్‌రావు, విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు బ్రహ్మాజీ మద్దతు తెలిపారు.

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీల సమ్మె రెండో రోజూ కొనసాగింది. సమ్మె శిబిరాన్ని బుధవారం సిపిఎం నాయకులు పి.సూర్యారావు, ప్రారంభించారు. సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, టిడిపి నాయకులు సాయల సత్యనారాయణ, అనపరెడ్డి గంగాధర్‌రావు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు బర్రె బాలరాజు, పొన్నూరు నాగరాజు, గొర్లం వెంకటేష్, జి.లక్ష్మణ్, ఏలేటి శ్రీను, గొల్లమందల శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం నుండి బస్టాండు వరకూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్ద అంబేద్కర్ విగ్రహానికి


భీమడోలులో..

వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు జి.విమల, లక్ష్మీదేవి, శాంతి, శిరోమణి, సుబ్బయ్య కుమారి పాల్గొన్నారు.

చింతలపూడి : అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని జనసేన చింతలపూడి కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టి జిబిజి రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యునియన్ జిల్లా కార్యదర్శి మణి, సరోజని, సరళ, సిఐటియు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్‌వాడీల సమ్మె రెండో రోజూ కొనసాగింది. విధులను బహిష్కరించి అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొన్నారు. సిపిఎం, టిడిపి, యుటిఎఫ్, సిఐటియు మద్దతు తెలిపాయి. అనంతరం ఎంపిడిఒ కృష్ణప్రసాద్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకురాలు మేఘలాదేవి, యుటిఎఫ్ నాయకులు అల్లాడి రాజు, పోసమ్మ, సిఐటియు నాయకులు కొండలరావు, నిర్మల, అంగన్‌వాడీల యూనియన్ నాయకులు నాగమణి, ఎస్తేరు పాల్గొన్నారు.

ముసునూరు : అంగన్‌వాడిల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె రెండో రోజు ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పల్లిపాము విజయకుమారి, పి.దుర్గమ్మ, మేరి సులోచలన, విద్యావతి, కళావతి పాల్గొన్నారు.

పోలవరం : అంగన్‌వాడీల సమ్మెకు సిపిఎం, టిడిపి నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ మద్దతు తెలిపారు. సిపిఎం పోలవరం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు ఎన్నోసేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందన్నారు. కనీస వేతనాలు, ప్రమోషన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.భారతి, సిపిఎం మండల కమిటీ సభ్యులు బోరగం భూ చంద్రావు, మడివి చలపతి, సముద్రాల సాయికృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, రైతు నాయకులు కుంచె దొరబాబు పాల్గొన్నారు.

మండవల్లి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం విరమించేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ స్పష్టం చేసింది. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మె చేపడుతుంటే అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి నిర్వహించాలని చూడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పులపర్రు-1,2 మణుగూరు-1, కోవాడలంక-1,2, కాకతీయ నగర్-1 అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి వేరేతాళాలు వేయడంపై వారు మండిపడ్డారు. కేంద్రాల తాళాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ నాయకులు చెల్లాయమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు

నిడమర్రు : అంగన్‌వాడీల సమ్మె రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు కోన జయమ్మ, ప్రేమలత మాట్లాడారు. అనంతరం ప్రదర్శన చేపట్టి సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసిన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు, యూనియన్ నాయకులు పార్వతి, నాగమణి, నాగేశ్వరి, ధనలక్ష్మి, త్రివేణి నాయకత్వం వహించారు.

ఆగిరిపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.శంకర్‌రావుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు అన్నమ్మ, అనురాధ, పుల్లమ్మ, కరుణ, రూప, జ్యోతి, ప్రజాసంఘాల నాయకులు చాకిరి శివనాగరాజు, సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్ పాల్గొన్నారు.


కొయ్యలగూడెం : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు సమ్మెలో ఆయన మాట్లాడారు. సమ్మెకు కొయ్యలగూడెం టిడిపి నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, జె.నాగమణి, ఎం.మాధవి, సిహెచ్.పద్మ, కె.జ్యోతి, శ్రీలత, టిడిపి నాయకులు పారేపల్లి రాంబాబు, రామకృష్ణ, చింతల వెంకటరమణ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్‌వాడీల సమ్మె రెండో రోజు సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం నుండి సొసైటీ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మండలంలోని 66 అంగన్‌వాడీ సెంటర్లను మూసివేసి సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, నత్తా వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.మురళీ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు బి.పనివర్ధిని, ఎన్.మార్తమ్మ, ఎం.సత్యవతి, కె.బాబి, జి.రామదుర్గ, బి.అచ్చలమ్మ పాల్గొన్నారు.

పెదవేగి : అంగన్‌వాడీల సమ్మెకు దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మద్దతు తెలిపారు. పెదవేగిలో సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీలు తలచుకుంటే ప్రభుత్వాలనే కూల్చేస్తారన్నారు. తక్షణం వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాతా సత్యనారాయణ, సిపిఎం నాయకులు కె.శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

ముదినేపల్లి : అంగన్‌వాడీల సమ్మె రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళరావు, నాయకులు దుర్గాప్రసాద్, సాయిలక్ష్మి తదితర నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు.

కలిదిండి : ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, ఉపాధ్యక్షులు చిన్నం శ్రీకాంత్, అంగన్‌వాడీల యూనియన్ నాయకులు షేక్ అబిదా


ఏలూరులో..

బేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు. మాజీ ఎంపీ, టిడిపి నేత మాగంటి బాబు, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, జనసేన నియోజకవర్గ నాయకులు కొల్లి వరప్రసాద్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

చాట్రాయి : అంగన్‌వాడీల సమ్మె రెండో రోజూ కొనసాగింది. సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చాగంటి రాజారావు మద్దతు తెలిపారు.

భీమడోలు : అంగన్‌వాడీలు రెండో రోజు సమ్మెలో వినత్నంగా నిరసన తెలిపారు. స్థానిక సాయిబాబా గుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అంగన్‌వాడీలు కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. ఈ శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాలతో మండలస్థాయి అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇవ్వాలని బాధ్యులను అడగడంతో వారు నిరాకరించారని తెలిపారు. తాళాలు ఇవ్వకుంటే కేంద్రాలను బలవంతంగా తీసి నిర్వహిస్తామని, సమ్మెలో పాల్గొన్న వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం అన్యాయమన్నారు. మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది సహకారంతో సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. న్యాయబద్ధమైన వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వారితో చర్చించాలని కోరారు. ఈ సమ్మెకు టిడిపి, వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాలు మద్దతు తెలిపాయి.

ఉంగుటూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు అన్నారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని గన్నితో పాటు పార్టీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం
ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బండివారిగూడెం, సీతంపేట, కృష్ణాపురం గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాపురంలో తాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపిపి దారబోయిన లక్ష్మి, ఎస్‌విటిసిహెచ్.శ్రీను రాజు, దాసరి రాంబాబు, దారాపు సూరిబాబు, ఉమ్మడి తేజ, దారబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా శక్తిని ప్రోత్సహించాలి : ఎపిఎం

ముసునూరు : వైఎస్ఆర్ వెలుగు క్రాంతి పథకం కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మహిళాశక్తిని ప్రోత్సహించాలంటూ మండల ఎపిఎం కుంచంబాబు పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రమైన ముసునూరులో వెలుగు మహిళా సిబ్బంది జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమాలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు చర్యలు : ఆదర్శ రాజేంద్రన్

నూజివీడు రూరల్ : ఓటర్ల జాబితా సవరణ గతంలో ప్రతిపాదించిన అంశాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రకాల పొలిటికల్ పార్టీల నాయకులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే వ్యక్తికి నియోజకవర్గంలో, రాష్ట్రంలో పలుచోట్ల ఓటు ఉన్నట్లయితే వాటిని గుర్తించి తొలగించటం జరుగుతుందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సీనియర్ పోస్టల్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

నూజివీడు రూరల్ : పట్టణ పరిధిలోని ప్రధాన పోస్ట్ ఆఫీస్ వద్ద తపాలా సిబ్బంది ఆందోళన బుధవారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామీణ డాక్ సేవక్(జిడిఎస్) నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమను నయవంచన చేసిందని ఆరోపించారు. సీనియర్స్‌కు, జూనియర్స్‌కు ఒకే విధమైన వేతనం ఇవ్వడం దారుణం అన్నారు. ఉత్తరాల బట్వాడా మినహా మిగిలిన విధులను తొలగించాలని కోరారు. సీనియర్స్‌కు తక్షణమే వేతనాలు పెంచాలని కోరారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్

పేదరిక నిర్మూలనే 'ఐక్యత విజయ పథం' లక్ష్యం

చింతలపూడి : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, పేద అభివృద్ధికి శాశ్వత పరిష్కారం అందించే దిశగా యాత్ర కొనసాగిస్తున్నదని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్ అన్నారు. ఐక్యతా విజయ పథం పాదయాత్ర పేరుతో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రాంతాలను సందర్శిస్తూ చేస్తున్న పాదయాత్ర 104వ రోజు చింతలపూడికి చేరుకుంది. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్, సచివాలయ వ్యవస్థను రూపకల్పన చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జూలై 23వ తేది నుంచి ప్రారంభించిన ఐక్యత విజయ పథం పాదయాత్ర 1,930 కిలోమీటర్లు నడవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మెండం సంతోష్ కుమార్, నూకపెయ్యి కార్తీక్, అలీబేక్ జయరాజు పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

చింతలపూడి : ఫీల్డ్ అసిస్టెంట్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఈనెల 18వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చింతలపూడి మండల ఫీల్డ్ అసిస్టెంట్స్ బుధవారం ఎంపిడిఒ మురళీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని విధానం ఆన్‌లైన్ టార్గెట్ విధానం రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 3 సంవత్సరాలు పూర్తి అయిన ఫీల్డ్ అసిస్టెంట్లకి ఎటిఎమ్‌ల అవకాశం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సునీల్, మండల ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

పోలవరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

పోలవరం : మండలంలోని పలు గ్రామాలైన పోలవరం, పట్టిసీమ పంచాయతీ కార్యాలయాల వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం సర్పంచి పాదం పుష్ప, పట్టిసీమ గ్రామ సర్పంచి సబ్బారావు, శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సమావేశాల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోరగం చెంచలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు కరిబండి నాగరాజు, మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు, యువమోర్చా అధ్యక్షులు టివి గణేష్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగింత

ఏలూరు స్పోర్ట్స్ : దారితప్పిన నాలుగేళ్ల బాలుడిని ఏలూరు రెండో పట్టణ పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు నగరంలోని తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన బాలుడు ఇంటి వద్ద నుంచి నడుచుకుంటూ నగరంలోని సమాధుల, ద్వారక ప్రాంతానికి వచ్చేశాడు. ఆ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఆ బాలుడిని గుర్తించి రెండో పట్టణ ఎస్ఐ సాధిక్‌కు సమాచారం అందించారు. వెంటనే సాధిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి సామాజిక మాధ్యమాల్లో ఆ బాలుడి గురించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. కొద్ది గంటల తర్వాత తల్లిదండ్రులు బాలుడిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మానవత్వం చాటుకున్న డాక్టర్ మనోజ్
నిరుపేదకు అంత్యక్రియలు

ముదినేపల్లి : ముదినేపల్లిలో మురారి కొండ(43) అనే నిరుపేద మురా కూలీగా పని చేస్తూ బుధవారం అకస్మాత్తుగా మృతి చెందాడు. ఈ వార్త తెలుసుకున్న డాక్టర్ మనోజ్ బాధిత కుటుంబానికి అంతిమ ఖర్చులకు గాను రూ.5 వేలు సహాయం చేసి, అన్ని తానై దహన కార్యక్రమంలో పాల్గొని సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ ఊపిరి ఉన్నంత వరకు నా సంపాదనలో కొంత భాగం స్వచ్ఛందంగా మానవ సేవకే వినియోగిస్తున్నానని తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం : ఎంఎల్‌ఎ

టి.నరసాపురం : క్రీస్తు బోధనలు అనుసరణీయమని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాస్టర్ కరుణ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మండల పాస్టర్ల సంఘానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, దారబోయిన లక్ష్మి, సర్పంచి సుసంద, దేవరపల్లి మత్తయ్య, పాస్టర్లు గిహెచ్.హెప్సిబ, ప్రసన్న పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ఏలూరు స్పోర్ట్స్ : ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామానికి చెందిన శికాకొల్లు సుదీప్(21) ఏలూరు సత్యనారాయణపేటలో తన స్నేహితులతో పాటు ఒక రూంలో ఉంటూ ఒక్కా రంగంలో పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం సుదీప్‌కు ఫిట్స్ రావడంతో వెంటనే తన స్నేహితులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వెళ్లి అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగానికి తీసుకురాగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. అతని మరణంపై అనుమానం వ్యక్తం చేసిన వైద్యులు ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు సుదీప్ మరణానికి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజలకు అందుబాటులో ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. కాని నేటికీ కనీసం పూర్తి అయిన భవనాలు కూడా ప్రారంభించకపోవటం గమనార్హం. మండలంలో దాదాపుగా ఆర్‌బికెలు, గ్రామ సచివాలయలు, హెల్త్ క్లినిక్‌లు 14 భవనాలు పూర్తి అయ్యి ఉన్నా నేటికి అవి ప్రారంభానికి నోచుకోవటం లేదు. సచివాలయాలు సిద్ధంగా ఉండి అలంకారాలుగా మాత్రమే మారాయి తప్ప ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు.



వెంకటాపురంలో ప్రారంభం కాని సచివాలయం

చింతలపూడి మండలంలో 21 ఆర్‌బికెలు, 21 గ్రామసచివాలయాలు, 19 హెల్త్ క్లినిక్‌లు ప్రారంభించారు. మండలంలో తిమ్మరెడ్డిపల్లి పంచాయతీలో ఆర్‌బికె, గ్రామ సచివాలయం, యర్రంపల్లి పంచాయతీలో ఆర్‌బికె, ఉర్లగూడెంలో ఆర్‌బికె, గ్రామ సచివాలయ హెల్త్ క్లినిక్, వెంకటాపురం పంచాయతీలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె, వెంకటాద్రిగూడెం పంచాయతీలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్, రాఘవపురం, గ్రామ సచివాలయం, ఆర్‌బికె, శివపురం పంచాయతీలో ఆర్‌బికె, యర్రగుంటపల్లి పంచాయతీలో సచివాలయం-1, ఆర్‌బికె, సీతానగరం పంచాయతీలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి అయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

కాంట్రాక్టర్లకు బిల్లులు పడక వాయిదాలు..

మండలంలో కొన్ని సచివాలయాలు పూర్తి అయ్యి, బిల్లులు పడక, భవనాలు పూర్తి అయినా ప్రారంభించటానికి కాంట్రాక్టర్‌లు ఒప్పుకోవటం లేదని చెబుతున్నారు. భవనాలు పూర్తి అయ్యి సుమారుగా రెండు సంవత్సరాలు అవుతున్నా నేటికీ భవనాలు ప్రారంభం కావటం లేదంటున్నారు. మండలంలో భవనలు పూర్తి అయినా కూడా కాంట్రాక్టర్లకు రూ.కోటిన్నర వరకూ బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కంకణం కట్టుకొని సచివాలయాలు, ఆర్‌బికెలు, హెల్త్ క్లినిక్‌లు పెట్టినా నేటికీ భవనాలు ప్రారంభం కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం కుంటుపడుతుంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి పూర్తి అయిన భవనాలు ప్రారంభించాలని కోరుకుంటున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

ఎంపిడిఒ, మురళీకృష్ణ

త్వరలోనే ఎంపీ, ఎంఎల్‌ఎ దృష్టిలో పెట్టి ప్రారంభిస్తాం.

ఎంఎల్‌ఎ దృష్టిలో పెట్టాం

పంచాయతీరాజ్ ఎఇ, కృష్ణారావు


ప్రారంభించానికి సిద్ధంగా ఉన్న భవనాలు మొత్తం లిస్ట్ ఎంఎల్‌ఎ దృష్టిలో పెట్టాం, త్వరలోనే ప్రారంభిస్తారు. కాంట్రాక్టర్‌లకు కోటిన్నర రూపాయల బిల్లులు రావాలి.



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కలిదిండి
స్థానిక కోట కలిదిండికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కస్తూరి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో భవన నిర్మాణ కార్మికులు ఏకమై రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవన నిర్మాణ కార్మికులు చనిపోయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడం విచారకరమని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పోతురాజు బాలాజీ అన్నారు. ప్రభుత్వం కార్మికులను విస్మరించిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో పి.బాలాజీ, పరసా రాజేష్, అక్బర్ బాషా, కటికల శ్రీనివాస్, సుంకర హరీష్, సానబోయిన సత్యన్నారాయణ పాల్గొన్నారు.



పెదలంకలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపితోనే మహిళా సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి - కలిదిండి
టిడిపితోనే మహిళా సంక్షేమం సాధ్యమని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదలంక పంచాయతీ పరిధి అప్పారావుపేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రచారం నిర్వహించారు. టిడిపికి మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు బళ్ళరాజు, నక్క శ్రీనివాస్, పురుషోత్తం, రామకృష్ణ, సూర్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - టి.నరసాపురం
వికలాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో వికలాంగ పిల్లలకు ప్రత్యేక విద్య ద్వారా ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రంలో ఐఇడిఎస్ఎస్ వీరాస్వామి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు కె.రాజు, జె.పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

పాడిరైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - చాట్రాయి
తిరువూరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ రెండవ విడత బోనస్‌ను బుధవారం జిల్లా పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్ర రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువూరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో మొత్తం 210 గ్రామాలకు రూ.1.65 కోట్లు పంపిణీ చేశామన్నారు. దీనిలో భాగంగా చాట్రాయి మండలంలోని 21 గ్రామాలకు రూ.42.57 లక్షలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరువూరు పాల కేంద్రం మేనేజర్ టి.సాంబశివ మూర్తి, పాల సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసిపితోనే సమగ్రాభివృద్ధి : ఆళ్ల నాని
26వ డివిజన్‌లో ఉత్సాహంగా గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
వైసిపితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎంఎల్‌ఎ ఆళ్ళ నాని పేర్కొన్నారు. 135వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం స్థానిక 26వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నర ఏళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించే బ్రోచెర్‌లను అందజేశారు. స్థానికులు ప్రస్తావించిన పలు సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అద్దంకి హరిబాబు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎమ్‌ఆర్ పెదబాబు, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా కోశాధికారి మంచెం మైబాబు పాల్గొన్నారు.

భూహక్కు చట్ట సవరణను నిరసిస్తూ మోటార్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్, 2022ను వ్యతిరేకిస్తూ గత పది రోజులుగా న్యాయవాదులు చేస్తున్న నిరసనలో భాగంగా బుధవారం జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్ కుమార్, కార్యదర్శి ఎవివి.భువనేశ్వరి, మానికల సూరిబాబు, విత్తనాల రత్నరాజు, పాశం ప్రతాప్, పొన్నా లక్ష్మణరావు పాల్గొన్నారు.

విఆర్ఒపై దాడికి ఖండన


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం, ముక్కామల విఆర్ఒ దెంగేటి పార్థసారధిపై మంగళవారం సాయంత్రం సచివాలయంలో వైసిపి సర్పంచి బండారు వెంకటలక్ష్మి కుమారుడు మల్లికార్జున దాడి చేయడాన్ని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విఆర్ఒపై దాడికి నిరసనగా బుధవారం కోనసీమ జిల్లాలో నల్ల బ్యాడ్జీలతో జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో ఉద్యోగస్తులపై కొంతమంది పార్టీల పేరుతో విఆర్ఒలపై, గ్రామ సచివాలయ సిబ్బందిపై దాడులు చేస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇది చాలా విచారకరమని అన్నారు. చాలాసార్లు ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిను, ఉన్నతాధికారులను కోరడం జరిగిందని, అయినా రాష్ట్రంలో ఉద్యోగులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు ఉద్యోగులపై దాడులు చేసినవారికి నాన్‌బెయిలబుల్ సెక్షన్లు విధించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఇలాగే ఉద్యోగులపై దాడులు కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ఏలూరు అర్బన్: ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాలలో ఈనెల 14వ తేదీన నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా స్వయం సహాయక మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహించి, వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించుట జరుగుతుందన్నారు. 'విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానము' అనే అంశముపై నిష్ణాతులచే ఇంజనీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల యందు అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని, విద్యుత్ పొదుపుపై అవగాహనకు గ్రామీణ ప్రాంతాలలో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ఈనెల 20న బహుమతుల ప్రధానం కార్యక్రమం ఉంటుందని సాల్మన్ రాజు తెలియజేశారు.

కాంట్రాక్టర్‌ను తొలగించాలి
గిరిజన దర్బార్‌లో పిడిఎస్‌యు, పివైఎల్ ఆధ్వర్యంలో ఎఒకు వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం
ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో నాసిరకం కూరగాయలు, సరుకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌ను రద్దు చేయాలని గిరిజన దర్బార్‌లో ఎఒ రామారావుకి పిడిఎస్‌యు, పివైఎల్ సంఘాల ఆధ్వర్యంలో వినతిని అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్, పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబురావు మాట్లాడుతూ విద్యా సంస్థల్లో కూరగాయలు, సరుకులు పంపిణీ చేయడానికి టెండర్లు పిలిచినప్పుడు.. ఇప్పుడు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ నాణ్యమైన సరుకులను చూపించి, పంపిణీ చేసే సమయంలో గత 20 సంవత్సరాలుగా పాడైన కూరగాయలు, నాసిరకం సరుకులను అందిస్తున్నారన్నారు. ఇలా పాడైన కూరగాయలు, నాసిరకం సరుకులను పంపిణీ చేస్తూ, ఐటిడిఎ అధికారులను మోసం చేస్తూ అధిక బిల్లులు వసూలు చేసుకుంటున్నారని విమర్శించారు. అంతేకాకుండా సరైన సమయానికి సరుకులను పంపిణీ చేయడం లేదన్నారు. దీనివలన వార్డెన్లు ఆర్థికంగా ఇబ్బందులు గురవుతున్నారన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేందుకు సాధ్యపడడం లేదన్నారు. కావున పాడైన కూరగాయలు, నాసిరకం సరుకులను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం, పివైఎల్ డివిజన్ నాయకులు పి.రామారావు, జి.రాజు పాల్గొన్నారు.



ఎఒకు వినతిని అందిస్తున్న నాయకులు

పంటల వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్
మిచౌంగ్ తుపానులో ఏర్పడిన పంట నష్టాలతో కూడిన ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పంట నష్టానికి సంబంధించి ప్రాథమికంగా రైతులు పంటల వారీగా, రైతు వారీగా, భూమి వివరాలతో వ్యవసాయ శాఖ అధికారికి లేదా రైతు భరోసా కేంద్రంలో తక్షణమే నమోదు చేయాలని సూచించారు.

'ఆడుదాం ఆంధ్రా'కు ప్రతిఒక్కరిని ప్రోత్సహించాలి

ముసునూరు: ఆడుదాం ఆంధ్ర ఆటలకు ప్రతి ఒక్కరిని ప్రోత్సాహించాలని ముసునూరు ఎంపిపి కోండా దుర్గాభవానీ వెంకట్రావ్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని మండల పరిషత్ కార్యలయంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామ సచివాలయం అధికారులతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తి (పురుషులు- మహిళలు) కూడా ఆడే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యమ్రంలో మండల వైసిపి అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మువ్వ స్రవంతి, వైవి.ప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి స్నేహితుల సహాయం

జీలుగుమిల్లి : మండలంలోని దిబ్బగూడెం గ్రామంలో ముచ్చిక మంగరాజుకి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటనలో సర్వం కోల్పోవడంతో విలపిస్తున్న బాధిత కుటుంబానికి బుధవారం అతని పదో తరగతి స్నేహితులు అండగా నిలిచారు. ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరు గురించి అడిగారు. వారి కనీస అవసరాలకు నిత్యావసర వస్తువులను, దుప్పట్లు, బట్టలు, రూ.20 వేల నగదును అందించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇల్లు నిర్మించు కోవడానికి ఏమైనా అవసరం ఉన్నచో సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్జున్, రాంబాబు, ముత్యం పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **POLISETTY VENKATA TATA RAO** S/o. Polisetty Brahmiah, D.14-12-4, I.V.L. Street, Near Sikile Girls Hostel, Narsapur, W.G.Dt. A.P. I have changed my name from **POLISETTI VENKATA TATA RAO,** (Old name) to **POLISETTY VENKATA TATA RAO** (New name) hence after all my documents and correspondence will be countinue with my new name **POLISETTY VENKATA TATA RAO** S/o. Polisetty Brahmiah.

మహారాజశ్రీ ఏలూరు మొదటి అదనపు జిల్లా కోర్టులో
I.A. No. 472/2023, I.A. No. 473/2023
I.A. No. 474/2023 in MVOP No. 43/2020

బిట్వీన్:
కె.యశ్వంతరాయలు -పిటీషనరు
AND
ఎ.శేషగిరిరావు & అదర్స్ -రెస్పాండెంట్లు
R-3: అడబాల దుర్గా భూలక్ష్మి
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 48 సం॥లు
R-4: అడబాల స్వామినాయుడు
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 34 సం॥లు
R-5: అడబాల రాజ
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 32 సం॥లు
R-6: అడబాల బేబి ధనలక్ష్మి
S/o. లేటు శేషగిరిరావు, వయస్సు 24 సం॥లు
All are residents of D.No. 8-104/A, మత్స్యపురి రోడ్, వీరవాసరం (V&M), ప॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషన్లు యందు 3 నుండి 6వ రెస్పాండెంట్సుకు నోటీసు నిమిత్తం **ది. 19-12-2023వ తేదీన ఆక్షేపణలున్నచో శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు** హాజరు కాని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

జగ్గవరపు సురేష్‌కుమార్‌రెడ్డి
అడ్వకేటు, ఏలూరు-1
సెల్: 9441606789

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం, సాలిపేట, డోర్ నెం. 2-179, వాడపల్లి కౌసల్య, W/o. రమేష్ అను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **S2639041.** నేను వీరవాసరం గ్రామంలో నివసిస్తున్నాను. నేను మా అమ్మగారి ఊరు వరహాపట్నం వచ్చాను. ది. 12-09-2023న నా పాస్‌పోర్టు జిరాక్స్ తీసుకొనుటకు ఆటోలో కలిదిండి సెంటర్‌లో జిరాక్స్ తీసుకొని వస్తుండగా మార్గమధ్యములో ఎక్కడో పోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

వాడపల్లి కౌసల్య
W/o. రమేష్, డోర్ నెం. 2-179
సాలిపేట, వీరవాసరం
వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 6309713179

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 651/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Pajjuri Gopalakrishna and another
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. పజ్జూరి గోపాలకృష్ణ, S/o. లక్ష్మణరావు, హిందువు, పురుషుడు, 48 సం॥లు, కంతేరు, H/o. అడవిపాలెం, పాలకొల్లు మండలం.
2. తొంట జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 43 సం॥లు, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku-534211

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 342/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Arepalli Radha Madhavi and another
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. ఆరేపల్లి రాధా మాధవి, W/o. కృష్ణారావు, హిందువు, స్త్రీ, 42 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, సాయినగర్ కాలనీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku-534211

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 303/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Pattisapu Radha and another
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. పట్టిసపు రాధ, W/o. వెంకటాచలం, హిందువు, స్త్రీ, 44 సం॥లు, డో.నెం. 10-4, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, 38 సం॥లు, డో.నెం. 19-5-11, బిసి ట్యాంకు వీధి, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku-534211

In the Court of Principal Junior Civil Judge, Tanuku
O.S. No. 540/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku
AND
Defendants:
Pithani Varalakshmi and another
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. పీతాని వరలక్ష్మి, W/o. సత్యనారాయణ, హిందువు, 40 సం॥లు, డో.నెం. 22-8-11/ఎ, యడ్లబజార్, పాలకొల్లు.
2. వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, హిందువు, పురుషుడు, 51 సం॥లు, డో.నెం. 22-5-8, సాయినగర్ కాలనీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku-534211